

# దెయ్యాల కొంప

మూలం : ఇబ్సెన్ అనుసరణ : వెంకటరావు

ఇందులో పాత్రలు:

| | | |
|---|---|---|
| తులశమ్మగారు | : | అధునాతన వితంతువు. |
| మందయ్య శాస్త్రి | : | వ్యవహారత. తులశమ్మగారి కుటుంబ మిత్రుడు |
| జనార్దనం | : | తులశమ్మగారి కొడుకు. ఆర్టిస్టు |
| కస్తూరి | : | ,, యింట్లో వుండే పిల్ల |
| సర్వారాయుడు | : | శిల్పి, కస్తూరి తండ్రి |
| రంగస్థలం | : | పల్లెటూరు, పట్నమూ కాని ఒక గ్రామంలో తులశమ్మగారింట్లో |
| కాలం | : | ఒకరోజు తెల్లవారిన దగ్గర్నుంచి మరునటి రోజు ప్రారంభమయే వరకు 24 గంటలు |

## మొదటి అంకం

రంగస్థలం:- పెద్దగది, గది ద్వారాలద్వారా తోట కనిపిస్తూవుంటుంది. గదికి ఎడమవైపు గోడలో ఒక ద్వారమూ, కుడివైపు గోడలో రెండు ద్వారాలూ వుంటాయి. గది మధ్య ఒక రౌండు టేబిలూ, దాని చుట్టూ కుర్చీలు, దాని మీద పుస్తకాలు, పత్రికలూ వుంటాయి. ఎడమవైపు ముందర గోడకు ఒక కిటికీ, దాని దగ్గరగా ఒక సోఫా, సోఫా ముందు చిన్న వ్రాతబల్లా వుంటాయి. పెద్దగది నానుకొని వెనుకవైపు చిన్నగది, చిన్నగది కుడివైపు ద్వారంనుంచి

తోటలోకి దారి. చిన్నగది అవతల గోడలో అమర్చబడిన గాజు చట్రముల ద్వారా విశాలమైన బయలు కనిపిస్తూవుంటుంది. వర్షాగమనంవల్ల వాతావరణం మందంగా వుంటుంది.

సర్వారాయుడు తోటలోకి వెళ్ళే ద్వారం దగ్గరగా నిలబడి వుంటాడు. అతని ఎడమకాలు అంగవైకల్యాన్ని సూచిస్తూవుంటుంది. ఎడమకాలు జోడులో కర్రతో చేసిన మడమ వుంటుంది. కస్తూరి కాళీ నీటి గొట్టం పట్టుకుని దారి కడ్డంగా నిలుచుని వుంటుంది.

కస్తూరి— (మెల్లిగా):- నీకేం కావాలి? అక్కడే నిలబడు. ఇదంతా బురదయిపోతుంది. పాడు వర్షం.

సర్వా— దేవుడిచ్చిన వర్షం తల్లీ.

కస్తూరి— దయ్యమిచ్చిన వర్షంగాదూ!

సర్వా— ఎంత కఠినంగా మాట్లాడుతున్నావు కస్తూరీ. (రెండడుగులు ముందుకు వేసి) నేను నీతో చెబుదామనుకున్న దేమిటంటే—

కస్తూరి— అలా దీర్ఘాలు తీయకు, అబ్బాయిగారు మేడమీద పడుకున్నారు.

సర్వా— ఇంకా పడుకున్నారా? మిట్టమధ్యాహ్న మవుతుంటే.

కస్తూరి— అదంతా నీకనవసరం.

సర్వా— నేను రాత్రంతా వినోదంతో గడిపాను,

కస్తూరి— అయితే అయివుండొచ్చు.

సర్వా— మనం బలహీనులమయిన మానవులం తల్లీ...

కస్తూరి— అవును.

సర్వా— ప్రపంచాకర్షణలు అనేకం—అయినా నేను ప్రొద్దుట అయిదున్నర కల్లా మేలుకుంటాను.

కస్తూరి— మంచిది, యిక వెళ్ళు. నేను నీమాటలకోసం వాచిపోయి వింటున్నట్టుగా వుంటుంది.

సర్వా— నువ్వు ఏమయినట్టు...?

కస్తూరి— నీవిక్కడ అందరికీ కనపడటం నాకిష్టంలేదు. కాబట్టి యిక వెళ్లు.

సర్వా— (కొంచెం ముందుకువస్తూ) అదంతా పనికిరాదు. నీతో కొంచెంసేపు మాట్లాడితేనేగాని నేను కదలను. ఈ వేళ మధ్యాహ్నంతో శరణాలయం దగ్గిర పని అయిపోతుంది. సాయంత్రం పడవమీద పట్టణానికి వెళ్ళిపోతాను.

కస్తూరి— సుఖంగా ప్రయాణం చెయ్యి.

సర్వా - రేపు శరణాలయ ప్రారంభోత్సవం జరుగుతుందిక్కడ. రేపు కడుపునిండా తిని త్రాగటానికి ఏ కొరతా వుండదు. అటువంటి అవకాశం దొరికిందంటే యీ సర్వారాయుడు విడిచి పెడతాడనుకోకు.

కస్తూరి— ఆహా, అలాగా.

సర్వా— రేపు పట్టణం నుంచి అంతా వస్తారు. మందయ్య శాస్త్రిగారు కూడా దిగుతున్నారు.

కస్తూరి— బాగానేవుంది! ఆయనీవేళే వస్తున్నారు.

సర్వా— ఆహా! అలాగయితే ఆయన నాగురించి యిష్టమెచ్చినట్లు మాట్లాడకుండా నేను జాగ్రత్తగా వుండాలన్న మాట.

కస్తూరి— అదేనా నీ పని?

సర్వా— అంటే?

కస్తూరి— (అర్థవంతంగా అతనికేసి చూస్తూ) ఈ సారి మందయ్య శాస్త్రిని ఏ విషయంలో మోసం చెయ్యదలచుకున్నావు?

సర్వా— యిస్స్! నీకేమైనా పిచ్చెక్కిందా? మందయ్య శాస్త్రిని మోసం చేస్తాననుకున్నావా? అబ్బే—ఆయన నాకు చాలా ఆప్తుడు. ఆయన గురించి అటువంటి ఆలోచనలే పనికిరావు. ఇంతకీ నేను నీతో మాట్లాడుదామనుకున్నదేమిటంటే నా పట్నం ప్రయాణం గురించి.

కస్తూరి— నీ వెంత త్వరగా వెడితే అంత ఆనందంగా వుంటుంది నాకు.

సర్వా— అవును నాతో నిన్ను కూడా తీసుకు వెడదామనుకుంటున్నాను.

కస్తూరి— (ఆశ్చర్యంగా) నన్ను కూడా తీసుకు వెడతావా?

సర్వా— నిన్ను నాతో యింటికి తప్పకుండా తీసుకు వెడతాను.

కస్తూరి— (చులకనగా) నీతో నన్ను యింటికి ఎన్నటికీ తీసుకువెళ్ళలేవు.

సర్వా— అలాగా. చూద్దాంగా.

కస్తూరి— తప్పకుండా చూద్దాం. తులశమ్మగారివంటి మనిషిదగ్గర పెరిగిన నేను, ఆవిడ కూతురిలాగ పెరిగిన నేను—నీతో నీ యింటికి—అందులోనూ అటువంటి యింటికి వస్తాననేమాట మాత్రం కల్ల!

సర్వా— అయితే ఏమిటి నీ ఏడుపు? తండ్రికే నువ్వు ఎదురు తిరగదలచుకున్నావన్నమాట?

కస్తూరి— (అతనివైపు చూడకుండా గొణుగుతూంది.) నేను నీ కూతుర్ని కానని చాలా సార్లు నువ్వే అన్నావుగా.

సర్వా— అబ్బా. పోనిద్దూ యిప్పుడదంతా ఎందుకు?

కస్తూరి— నువ్వు నన్ను చాలాసార్లు కొట్టి, అనేకసార్లు లంజముండా అని కూడా తిట్టలేదూ? సిగ్గులేదూ?

సర్వా— అలా నిన్నెప్పుడూ పిలవలేదని ప్రమాణం కూడా చేస్తాను.
కస్తూరి— నీ ప్రమాణాలు లెఖ్ఖేమిటి ?
సర్వా— నేను త్రాగుడు మైకంలో వున్నపుడే నిన్ను తిట్టి వుంటాను. ప్రపంచంలో అవగుణాలు అనేకం అమ్మా !
కస్తూరి— అలాగా !
సర్వా— మీ అమ్మ కోపంగా వున్నప్పుడే నాకు అలా వుండేది. నా చిరాకు ఏదో విధంగా తగ్గించుకోవా లంటావా ? అది మాత్రం ఏమీ ఎరగనట్టు ముద్దరాలుగా వుండేది. (ఆమెను అనుకరిస్తూ) "అబ్బ, పోనిద్దురూ, నన్నిలాగ బతకనియ్యండి. కందర్ప వారింట్లో మూడు సంవత్సరాలున్నానుగాని, పల్లెత్తు మాట అనిపించుకోలేదు." (నవ్వుతాడు)
కస్తూ— పాపం ! అమ్మ బతికి వున్నన్నాళ్ళు నువ్వే కాల్చుకు తిన్నావు.
సర్వా— అంటారు మరి, అందరూ నన్నే అంటారు.
కస్తూ— (వెళ్ళిపోబోతూ) హు ! ఆ కాలం కూడా సాక్ష్యమే, నీ పాడు పనులకు.
సర్వా— ఏమిటమ్మా నువ్వనేది ?
కస్తూ— బుద్ధిః కర్మానుసారిణి అంటున్నాను.
సర్వా— నువ్వనేది తెలుగే ?
కస్తూ— ఏదో ఒకటి, ఏదైనా ఒకటే నీకు.
సర్వా— నీకిక్కడ మంచి చదువు అబ్బిందమ్మా. ఇక ముందు నీ కది బాగా ఉపయోగిస్తుంది.
కస్తూ— (కొంచెమాగి) నువ్వు నన్ను పట్నం తీసుకు వెడతానన్నా వెందుకూ ?
సర్వా— తండ్రి తన ఏకైక సంతానాన్ని ఎందుకు తీసుకు వెడతాడో నీవు అడగాలా? నాకు నువ్వు తప్ప యింకెవరున్నారు చెప్పు ?
కస్తూ— ఆ కబుర్లు నా దగ్గిర పనికిరావు. ఎందుకు రమ్మంటున్నావో చెప్పు.
సర్వా— అయితే విను. నేనిప్పుడొక కొత్తమార్గం తొక్కాలనుకుంటున్నాను.
కస్తూ— అది నీవు చాలాసార్లు ప్రయత్నించావు — కాని అది ఎప్పుడూ పుల్లయ్య వేమువరమే అయింది.
సర్వా— కాని యీసారి చూడు కస్తూరీ ! నా బుర్ర బద్దల గొట్టెయ్యి యీసారి—
కస్తూ— (నేలను కాలితో తన్ని) ఆ ప్రమాణాలు కట్టిబెట్టు !
సర్వా— అహ్హా, హు ! సరే; నేను చెప్పేదేమిటంటే యీ శరణాలయంలో పనిచేసి నాలుగు డబ్బు లార్జించాను.
కస్తూ— ఆర్జించావా ? అయితే నీకు మరీ మంచిది.
సర్వా— కాని యిక్కడ, యీ పల్లెటూళ్ళో ఖర్చు పెట్టడానికేముంది?
కస్తూరి— అయితే?

సర్వా— ఈ డబ్బుతో మళ్ళీ నాలుగుడబ్బులు కూడబెట్టే వ్యవహార మాలోచించాను. పట్నంలో హార్బరుకి దగ్గరగా భోజన వసతి గృహం నడుపుదామని ఆలోచిస్తున్నాను —

కస్తూరి— ఓయి దేముడా?

సర్వా— చాలా గొప్పవసతి గృహం, అంతేగాని ప్రతీ సామాన్యుడికీ అందుబాటులో వుండే బందిలి దొడ్డిలా వుండదు. పెద్ద పెద్ద ఆఫీసర్లు, కెప్టెనులకు మాత్రమే.

కస్తూరి— అయితే నేను చెయ్యవలసినదే___

సర్వా— నువ్వక్కడ సాయంచేస్తావు. నువ్వక్కడ అలంకారం మాత్రమే అక్కడ పని నీకు కష్టంగా వుండదని ప్రమాణం చెయ్యగలను. నీకు తేలికైనదే చెయ్యవచ్చు.

కస్తూరి— అవును. అలాగేమరి!

సర్వా— ఆ యింట్లో యింకా మరికొందరు ఆడవాళ్లుంటారు. ఎందుకంటే సాయంత్రం అయేసరికల్లా మనమా ప్రదేశాన్ని కొంచెం ఆకర్షవంతంగా చెయ్యాలి___ కొంచెం ఆట, పాటవుండాలి. అక్కడకి వచ్చేవాళ్ళంతా సముద్రం మీద వుండేవాళ్ళే. (ఆమెకు దగ్గరగావెళ్ళి) నీవు మాత్రం మూర్ఖంగా నీదారి నీవే చూసుకోకు. ఇక్కడమాత్రం ఏమిటుంది? నీకు ఆవిడ చెప్పించిన చదువు ఎందుకైనా పనికొస్తుందా? ఈ యింట్లో పుట్టబొయ్యే పిల్లలని యికముందు నువ్వే చూసుకోవాలని విన్నాను. ఇక్కడ నువ్వు చెయ్యవలసిన పని అదేనా? నీబలం ఆరోగ్యం యౌవ్వనం పాడుచేసుకుని యీ మురికంతా శుభ్రం చెయ్యవలసిన కర్మ నీకెందు కంటాను?

కస్తూరి— కాదు, నేను అనుకున్నట్టుగానే జరిగితే___జరిగితే జరగొచ్చు, ఎవరు చెప్ప గలరు?

సర్వా— ఏమిటి. జరిగేది?

కస్తూరి— ఏమీలేదులే. అయితే యిక్కడ నీవు కూడబెట్టినది చాలా వుంటుందా?

సర్వా— అంతా కలిపి పదిహేను వందలో, రెండువేలో వుంటుంది.

కస్తూరి— అయితే ఫరవాలేదు.

సర్వా— ప్రారంభించటానికి ఆ మాత్రం చాలునమ్మా.

కస్తూరి— ఆ డబ్బులోది నాకేమీ యివ్వదలచుకోలేదన్న మాట.

సర్వా— అలాయిస్తే చచ్చిపోతాను.

కస్తూరి— నా బట్టలకి సరిపోయే డబ్బు ఒక సారైనా యివ్వదలచు కోలేదా?

సర్వా— నాతోవచ్చి పట్నంలో వుంటే నీకు కావలసినన్ని బట్టలు.

కస్తూరి— ఇంతేనా? ఆ మాత్రం నా గురించి శ్రమపడితే నేనూ తెచ్చుకో గలను.

సర్వా— తండ్రి చెప్పు చేతలలో వుండటం చాలా మంచిది కస్తూరి. పెద్ద వీధిలో నీకు మంచి యిల్లొకటి చూస్తాను. దానికి అట్టే డబ్బు అవసరం లేదు— మనం దాన్నే నావికుల వసతి గృహంగా చెయ్యొచ్చు.

కస్తూరి— కాని నాకు నీతో వుండాలని లేదు! నాకు నీతో ఏ సంబంధమూ లేదు. నువ్వింక వెళ్ళవచ్చు!

సర్వా— నువ్వు నాతో అట్టే కాలం వుండనక్కరలేదమ్మా. ఆ అదృష్టం లేదు—నీ పాత్ర ఎలా నటించాలో తెలుసుకో గలిగితే చాలు. ఈ ఒకటి రెండేళ్ళలోను ఎంత చక్కగా ఎదిగావు?

కస్తూరి— నటిస్తే—?

సర్వా- ఏ నావికుడో, ఏ కెప్టెనో, మొదటిసారి వచ్చినవాడే—

కస్తూ— అటువంటివాణ్ణి పెళ్ళాడటం నా కిష్టంలేదు. నావికులకి విచక్షణ జ్ఞానం వుండదు.

సర్వా— వాళ్ళకి ఏమిటి వుండదూ?

కస్తూ— నావికులు ఎలాటివాళ్ళో నాకు తెలుసు. వాళ్ళు పెళ్ళాడటానికి తగినవారు కారు.

సర్వా— సరే వాళ్ళను పెళ్ళాడటం గురించి బాధపడకు ఎలాగయినా నువ్వు సొమ్ము చేసుకోవచ్చు. (కొంచెం ధైర్యంగా) వాడు — అమిలటరీవాడు, అమెరికా వాడు — చిన్నఓడలో వచ్చాడే, వాడు ఒక రోజున మీఅమ్మకు నూరు రూపాయ లిచ్చాడు — అది నీకంటె ఏమీ అందమైనది కాదు.

కస్తూ— (ముందుకు వెళ్ళి) ఫో, అవతలికి.

సర్వా— (వెనకకు తగ్గి) ఆగు, ఆగు! కొడతా వేమిటి కొంప దీసి?

కస్తూ— ఆ! అమ్మని గురించి నువ్వు అలా మాట్లాడితే అంతే జరుగుతుంది. నిన్ను కొడతాను. ఫో. అవతలకి (తోట వైపు తలుపు దగ్గరకి నెట్టుతుంది అతన్ని) తలుపు చప్పుడు చెయ్యకు. బాబుగారు—

సర్వా— ఆయన నిద్దరపోతున్నాడు— నాకు తెలుసు. ఆయన గురించి అంత ఆత్రుత ఎందుకో ఆశ్చర్యంగా వుంది. (తక్కువస్థాయిలో) ఓహో! ఆయనే ఒక వేళ అలా చేస్తున్నాడనటానికి అవకాశం?

కస్తూ— ఫో, త్వరగా పో అవతలకి! నీ బుద్ధి సంచారం సాగిస్తోంది. అలా వెళ్ళకు. మందయ్యశాస్త్రిగారు వస్తున్నారు. ఇలా దొడ్డి దారిని పో.

సర్వా— (కుడివైపుకి కదులుతూ) అవునవును— మంచిది. ఆ వచ్చే ఆయనతో కొంచం మాట్లాడు. పిల్లలు తండ్రికి ఎంత విధేయులుగా, కృతజ్ఞులుగా వుండాలో ఆయన బాగా చెపుతాడు. ఎంత చెడ్డా నేను నీతండ్రి నేనని నీకూ తెలుసు, రిజిష్టరులో ఆసంగతి చూపించగలను గూడా.

[కస్తూరి తెరిచిన ద్వారంగుండా అతను వెళ్ళిపోతాడు. ఆమె తలుపు మూసేస్తుంది. ఆతృతగా అద్దంలో చూసుకుంటుంది. జుట్టు, పైట సవరించుకుంటుంది. విసనకర్రతో కొద్దిగా విసురుకుని, పువ్వులపని చూస్తుంది. మందయ్యశాస్త్రి ప్రవేశిస్తాడు. ఖద్దరు పంచ, చొక్కా, కండువా వేసుకుని వుంటాడు. చేతిలో గొడుగు ఖద్దరు సంచీ ప్రయాణాన్ని సూచిస్తూ వుంటాయి.]

మందయ్యశాస్త్రి— కులాసాగా వున్నావమ్మా కస్తూరీ?

కస్తూరి— (ఆనంద సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ) ఆహా! మీరా! కులాసాగానే వున్నానండి. మీరెప్పుడూ రావడం?

మంద— ఇదే రావడం. (గదిలోకి వచ్చి) రోజూ యీ వర్షాలేమిటో తీనేస్తున్నాయి.

కస్తూరి— రైతులకి యీ వర్షాలు చాలా ముఖ్యంగదండీ.

మంద— అవును నువ్వు చెప్పింది నిజమే. పట్టణాల్లో వుండే మేము వీటి గురించే ఆలోచించము. (కండువా తీసివేస్తాడు.)

కస్తూరి— (అందుకుని) ఇది చాలా తడిగావుందే! హాల్లో ఆరవేస్తానుండండి, మీ గొడుగు గూడా యివ్వండి. విప్పి వుంచితే ఆరుతుంది.

[కుడివైపువున్న రెండో ద్వారంగుండా గొడుగూ, కండువా, పట్టుకువెడుతుంది. మందయ్యశాస్త్రి సంచీ ఒకకుర్చీలో పెడతాడు. కస్తూరి వస్తుంది.]

మంద— ఇంట్లోపడగానే ఎంతో హాయిగావుంది — ఇక్కడ అంతా సవ్యంగావుందా.

కస్తూరి— మీదయవల్ల.

మంద— మీరంతా హడావిడిగా వున్నారేమో. రేపటితో అంతా అయిపోతుంది.

కస్తూ— ఇంకా చెయ్యవలసింది చాలావుందండి.

మంద— తులశమ్మగారింట్లోనే వున్నారనుకుంటాను.

కస్తూ— వున్నారు. అబ్బాయిని లేపడానికి యిప్పుడే మేడమీదికి వెళ్ళారు.

మంద— (సందేహంగా) చూడు—జనార్దనం వచ్చాడని నేను మందబయల్ని విన్నాను.

కస్తూ—నిజమే, ఆయన మొన్ననేవచ్చారు. ఆయన యీ వేళ వస్తారనుకున్నాం అసలు.

మంద— ఆరోగ్యంగా, జాగ్రత్తగా వున్నాడా ?

కస్తూ— మీదయవల్ల కులాసాగానే వున్నారు. కాని ప్రయాణంవల్ల బాగా అలసిపోయారు. బొంబాయినుంచి నేరుగా వచ్చేశారు — అంటే మధ్యలో ఎక్కడా ఆగలేదు. ఆయనింకా నిద్రపోతూనే వున్నారనుకుంటాను. మీరు ఏమీ అనుకోకుండావుంటే మనం కొంచెం మెల్లిగా మాట్లాడుకుందాం.

మంద— అలాగే, మనం నిశ్శబ్దంగానే వుందాం.

కస్తూ— (రౌండు టేబిలుకు దగ్గరగా ఒక కుర్చీ జరుపుతుంది) ఇలా కూర్చోండి శాస్త్రిగారూ. (ఆయన కూర్చుంటాడు. కాళ్ళదగ్గర ఒక బల్లపడేస్తుంది). ఇప్పుడు సుఖంగా వుందా ?

మంద— బాగుంది. బాగుంది. చాలా హాయిగావుంది (ఆమెకేసి చూస్తాడు) కస్తూరీ నేను క్రిందటిసారి నిన్ను చూసిన కంటె బాగా ఎదిగావని అనుకుంటున్నాను.

కస్తూ— మీకూ అలాగే తోచిందా ? తులశమ్మగారు నేను ఎదిగానంటున్నారు.

మంద— అవును ఎదిగావు కొంచెం వొళ్ళుచేశావుగూడా—నీ వయస్సుకి తగినట్టుగానేలే. [క్షణంనిశ్శబ్దం]

కస్తూ— మీరు వచ్చారని అమ్మగారితో చెప్పనా ?

మంద— ఒద్దు తొందరేం లేదుగాని—కస్తూరీ నువ్వు చెప్పు. మీ నాన్న యిక్కడెలాగ వుంటున్నాడో ?

కస్తూరి— నిక్షేపంలా వుంటున్నాడు.

మంద— క్రిందటి సారి పట్నం వచ్చినప్పుడు నన్ను చూడటానికి వచ్చాడు.

కస్తూరి— వచ్చాడా? మీతో మాట్లాడ్డం అంటే ఆయనకి సరదా.

మంద— అతను తరుచూ, ప్రతిరోజూ నీ దగ్గరకి వస్తాడేమో?

కస్తూరి— నా దగ్గరికా ? తీరుబడి అయినప్పుడల్లా వస్తాడు.

మంద— మీ నాన్నకి నైతిక బలం తక్కువ. అతన్ని సరిగా నడిపించే వాళ్ళుండాలి.

కస్తూరి— ఆ సంగతి నాకు తెలుసు.

మంద— అతను ఆధార పడగలిగేవాళ్లు, అతనికి గురివున్న వాళ్ళు అతని దగ్గర వుండాలి. క్రిందటిసారి అతను నా దగ్గర కొచ్చినప్పుడు ఆ విషయాన్ని అతనే ఒప్పుకున్నాడు.

కస్తూరి— నాతోకూడా అదే అన్నాడు. కాని నేను వెళ్ళిపోతే తులశమ్మగారు చేసుకోలేరు—అందులోనూ శరణాలయం ప్రారంభించే యీ రోజుల్లో. పైగా ఆ విణ్ణి వదలి వెళ్ళాలంటె నాకూ భయం గానే వుంది. ఆవిడ నన్ను ఎంతో యిదిగా చూసుకుంటుంది.

మంద— మరి నీ కుమార్తె విధి నీవు నిర్వర్తించడమో—ఇంతకూ మీ అమ్మగారి అనుజ్ఞముందు తీసుకోవాలి.

కస్తూరి— ఇంతకూ నా వయస్సులో వున్న ఆడపిల్ల ఒక యింట్లో ఒక మగవాడితో వుండటం—ఆలోచించ వలసిన విషయం.

మంద— ఏమిటీ ! మనం మాట్లాడేది మీ నాన్న గురించేగదటమ్మా !

కస్తూ— అవుననుకోండి — అయినా, అది ఘరియయిన యిల్లయి, పెద్దమనిషితో అయితే వుండొచ్చు—

మంద— కాని కస్తూరి—

కస్తూ— ఆయన యందు నాకు నిజంగా వాత్సల్యం, ప్రేమ వుండాలి— నిజంగా కూతురులాగ వుండగల గాలి—

మంద— చెప్పమ్మా, చెప్పు—

కస్తూ— నాకు పట్నంలో వుండడమంటే చాలా సరదా. ఇక్కడ చాలా ఒంటరిపాటుగా వుంది. మీకు తెలుసు గదండీ శాస్త్రిగారూ ఒంటరిపాటు ఎంత బాధగా వుంటుందో. ఇలా అంటున్నాగాని నేను యిక్కడ వుండగలుగుతున్నాను; వుంటున్నాను గూడా. నాకు సరియైన స్థలం ఎక్కడైనా వుందేమో చెప్పండి శాస్త్రిగారూ ?

మంద— నేనా ? నాకు తెలియదు, నిజంగానే.

కస్తూ— కాని, శాస్త్రిగారూ— నన్ను మాత్రం మీరెప్పుడూ మరువకండి.

మంద— (లేస్తూ) నిన్నెప్పుడూ మరచిపోనమ్మా కస్తూరీ.

కస్తూ— నే ననుమానించేదేమిటంటే—

మంద— నువ్వు వెళ్ళి తులశమ్మగారితో నేను వచ్చానని చెప్పు.

కస్తూ— ఆమె నిప్పుడే తీసుకు వస్తాను.

[ఎడమవైపునించి నిష్క్రమిస్తుంది. ఒకటి, రెండుసార్లు మందయ్య పచారు చేస్తాడు. చేతులు వెనక్కి కట్టుకుని వెనకవైపు ద్వారంగుండా తోటలోకి చూస్తూ వుంటాడు. టేబిలు దగ్గరకి మళ్ళీ వచ్చి పుస్తకం తీసుకుని ముఖపత్రం చూస్తాడు. చలించి, అదిపడవేసి మిగతా పుస్తకాలు చూస్తాడు.]

మంద— ఆహా !— నిజమే.

[తులశమ్మగారు ఎడమవైపు ద్వారంగుండా వస్తుంది. ఆమె వెనుక కస్తూరి ప్రవేశం. కస్తూరి మళ్ళీ కుడివైపుద్వారంలోంచి వెళ్ళిపోతుంది.]

తులశమ్మ— (నమస్కారంచేస్తూ) నమస్కారమండీ శాస్త్రిగారు. మీరు రావడం చాలా సంతోషంగావుంది.

మంద— అంతా కులాసాగా వున్నారా ? నేనువచ్చి నామాట నిలబెట్టుకున్నాను. సరిగ్గా అన్నటైముకి వచ్చాను.

తుల— ఎప్పుడూ మీరంతేగా !

మంద— నేను ఆ అలవాటు మరి తప్పించుకోలేను. సంస్కృతపాఠశాలకి వెళ్లినా, ఏ శుభకార్యానికి వెళ్లినా అంతే. టైముకివెళ్లాలి.

తుల— మీరు అన్నమాటప్రకారం రావడం చాలా ఆనందం. మనం భోజనానికి లేచేలోగా వ్యవహారం కొంచెం చూసుకోవచ్చు. ఇంతకీ మీసామానేదీ ?

మంద— అక్కడ ఒకషాపులో పెట్టించాను. రాత్రికి పడక్కి అక్కడికే వెళ్ళిపోతాను.

తుల— ఈవేళకి యిక్కడ వుండనంటారా ?

మంద— మీదయకు చాలా సంతోషం. నన్నాట్టే బలవంతంచెయ్యకండి. అక్కడ నుంచి అలా పడవకిగాని, బస్సుకిగాని వెళ్ళడం సుఖం.

తుల— పోనీ మీకు ఎలావీలుగావుంటే అలాగే చెయ్యండి. మనం ముసలివాళ్ళం. ఇద్దరమూ ఒకచోట వుంటే అదోకలాగగూడా వుంటుంది—

మంద— హా! హా! మీరు ఛలోక్తులాడుతున్నారు! మీరు యింత ఉత్సాహంగా వుండటానికి కారణం లేకపోలేదు — మొదటిది రేపు జరుగబోయే కార్యక్రమం. రెండోది జనార్దనం యింటికి రావడం.

తుల— అవును, నేను అదృష్టవంతురాల్నేగదూ! వాడు యింటికివచ్చి రెండేళ్ళయింది. ఈ చలికాలం పోయేదాకా యిక్కడే వుంటానన్నాడు.

మంద— అన్నాడా, నిజంగా! చాలా మంచిపని చేశాడు. ఎందువల్లనంటే బొంబాయిలోను, పూనాలోను అతన్ని ఆకర్షించేవి చాలా వుంటాయని నా వుద్దేశ్యం.

తుల— ఎలాగయినా యిక్కడ వాడితల్లివుంది. మావాడి హృదయంలో ఒకమూల యింకా నాకు స్థానంవుంది. వాడు చిరంజీవిగా వుండాలని నాకోరిక.

మంద— ఆ కళలో మునిగిపోయి మీకు దూరంగావుండి మిమ్మల్ని మరచిపోతే మరీ బాధగా వుంటుంది.

తుల— నిజమే. కాని వాడితో అలాటి ప్రమాదమేమీలేదు. అందుకు నేను సంతోషిస్తున్నాను. మీరు యిప్పుడు వాణ్ని గుర్తుపట్ట గలరా అని నా సందేహం. ఇప్పుడే దిగివస్తాడు కిందకి. బద్ధకంగావుండి సోఫామీద పడుకున్నాడు. నిలబడేవున్నారు కూర్చోండి.

మంద— అలాగే. నేనువచ్చి మీ పనులకేమీ అటంకం కలిగించడం లేదుగదా?

తుల— అబ్బే లేదండీ.

[ఆమె బల్లదగ్గర కూర్చుంటుంది]

మంద— సరే. అయితే మీకు కాగితాలు చూపిస్తాను. (లేచి తనసంచీవున్న కుర్చీదగ్గరకొచ్చి ఎదురుగా కూర్చుంటాడు. కాగితాలు పెట్టడానికి ఖాళీజాగాకోసం చూస్తాడు) ఇప్పుడు ముందుగా ఏమిటంటే— (ఆగిపోతాడు) తులశమ్మగారు మీరు నాకు నిజం చెప్పండి యీ పుస్తకాలు యిక్కడెందుకున్నాయి?

తుల— ఈ పుస్తకాలా? నేను చదువుతున్నాను.

మంద— మీరు యిలాటివి చదువుతారా?

తుల— ఆ, నిజంగానే.

మంద— ఈ పుస్తకాలు చదివినందువల్ల ఏమన్నా హాయిగా వున్నట్టుగాని, బాగుపడినట్టుగాని తోస్తుందా మీకు.

తుల— అవి చదివినందువల్ల నాకు ఆత్మ విశ్వాసం ఎక్కువవుతోంది.

మంద— అది ఆశ్చర్యంగానే వుంది. ఎందువల్ల?

తుల— ఎందువల్లనంటే, నా మనస్సులోని అనేక భావాలకు అర్థమూ, సమర్థనా అందులో కనబడుతున్నాయి. కాని, శాస్త్రిగారూ నాకు ఆశ్చర్యం కలిగించే దేమిటంటే యీ పుస్తకాల్లో కొత్త విషయమేమీలేదు. అందరు మనుష్యులూ

అనుకొనేదీ ఆచరించేదీ అందులో వుంది. కాని చాలామంది దాన్ని లెక్క చెయ్యరు, ఆ విషయాన్ని అంగీకరించరు.

మంద— చాలామంది అంతేనని మీరు రూఢిగా చెప్పగలరా ?

తుల— అవును, మనలాటి వాళ్ళలో గూడా వున్నారు.

మంద— ఇక్కడెవరూ వుండరని నా వుద్దేశ్యం. మనలాటి వాళ్ళలో ఎవరూవుండరు.

తుల— మనలోనే నిజంగా మనలాటి వాళ్ళలోనే.

మంత— నేననుకునే దేమిటంటే—

తుల— ఈ పుస్తకాలంటే మీకు నిజంగా వున్న అభ్యంతరం ఏమిటి ?

మంద— అభ్యంతరమా—? అటువంటి పుస్తకాల ప్రచురణలో నాకు ప్రత్యేకమైన ఆసక్తి ఏమీలేదని మీరు అనుకోకండి.

తుల- మీరు దేన్ని గర్హిస్తున్నారో మీకే తెలియదు.

మంద— ఈ పుస్తకాలని గురించి వీటిని గర్హించేటంత చదివాను.

తుల— అవొచ్చు. కాని మీ స్వంత అభిప్రాయమేమిటి ?

మంద— తులశమ్మగారూ జీవితంలో అనేకసార్లు యితరుల అభిప్రాయంమీద ఆధార పడవలసి వస్తుంది. ఈ ప్రపంచంలో అదొకమార్గం; అదీ ఒక మార్గమనే విషయం కూడ నిజమే. లేకపోతే సంఘం ఏమయిపోతుంది ?

తుల— మీరు చెప్పినది నిజమే అయి వుండవచ్చు.

మంద— పైగా యిటువంటి సారస్వతం గూడా మన దృష్టిని కొంత ఆకర్షించాలనే విషయం నేను కాదనను. నేను మిమ్మల్ని నిందించటంలేదు— ప్రపంచంలో సంగతులన్నీ తెలుసుకోవలసిందే. మీ అబ్బాయిని స్వేచ్ఛగా వదిలేసిన యీ వాతావరణం గురించి మీరు బాగా తెలుసుకోవాలి కాని—

తుల— కాని—?

మంద— (తగ్గించినస్థాయిలో) కాని ఎవరూ దీనిని గురించి మాట్లాడరు. ఎవరి గదిలో వారు రహస్యంగా చదువుకునే వీటి గురించిగాని, ఆలోచించేవాటి గురించి గాని ఎవరూ అడగరు.

తుల— ఎవరూ అడగరు. మీరు చెప్పింది నిజమే.

మంద— మీకీ శరణాలయం కట్టించేటప్పుడు వుండే ఉద్దేశ్యమేమిటో ఆలోచించండి. అది నిశ్చయం చేసుకున్న నాటి ఆలోచనలకీ, ఈనాటి మీ అభిప్రాయాలకీ— నే నూహించగలిగినంత వరకూ మీలో చాలా మార్పువుంది.

తుల— అవును. ఆ విషయం నేను అంగీకరిస్తాను. శరణాలయం గురించి కాదూ—

మంద— మనం మాట్లాడబోయేది శరణాలయం గురించే. జాగ్రత్తగా ఆలోచించండి మనం ముందు ఈపని చూద్దాం. (ఒక కవరు తెరిచి కొన్ని కాగితాలుతీస్తాడు) ఇది చూడండి.

తుల— దస్తావేజులా ?

మంద— అవును. ఇవన్నీని—అన్నీ ఒకక్రమంలో వున్నాయి. ఇవన్నీ సరిగ్గా మైముకి సంపాదించడమంటే మాటగాదు. అధికార్లని ఎంతో వొత్తిడిచేస్తే వొచ్చాయి. స్వతంత్రం వచ్చాక యీ ఆఫీసులన్నీ మరీపాడయిపోయాయి. ఎలాగో చివరకి అంతా తెచ్చాను. (కాగితాలు తిప్పుతూ) ఇదిగో యిది శరణాలయం, స్కూలు, వాటికి సంబంధించిన బిల్డింగులూ, స్థలమూ వగైరా దానపత్రము. ఈ శరణాలయానికి సంబంధించిన నిబంధనలన్నీ చట్టసమ్మత మైన అంగీకారం పొందినవే. ఇదిగో చూడండి. (చదువుతాడు) "రావు బహద్దూర్ రంగారావుగారి శరణాలయ నిబంధనావళి".

తుల— (దస్తావేజులకేసి దీర్ఘంగా చూసి) అంతా స్థిరమైపోయినట్లే.

మంద— రావుబహద్దూర్‌కి, రంగారావుకుమధ్య యింటిపేరు లేకుండా వుంటేనే బాగుంటుందనుకున్నాను. అదికూడా వుంటే యింకా దీర్ఘంగా వుంటుంది.

తుల— అవునవును. మీరు చేసిందే బాగుంది.

మంద— బ్యాంకులో వున్న అసలు లోంచి వాడిన దానికి సర్దిపై కాబడిన మొత్తం, వడ్డీ ప్రస్తుత ఖర్చులకి ప్రత్యేకించాము.

తుల— చాలా బాగుంది. మీరే యీ విషయాలన్నీ చూస్తే బాగుంటుందని నా అభి ప్రాయం.

మంద— సంతోషంతో చేస్తాను. ప్రస్తుతానికి సొమ్ము మనం బ్యాంకులోనే వుంచితే మంచి దనుకుంటాను. వడ్డీ ఆట్టే రాదనుకోండి. తరువాత ఎప్పుడైనా మంచి తనఖా బేరం వస్తే — మొదటి తనఖా అయి ఆస్తి బాగుంటే — అప్పు యివ్వడం మంచిది.

తుల— అవునవును. వాటన్నిటి గురించీ మీకే బాగా తెలుసు.

మంద— ఆ విషయాలన్నీ జాగ్రత్తగా చూస్తాననుకోండి. నేను చాలా రోజులబట్టి మిమ్మల్ని అడుగుదా మనుకొన్నది ఒక విషయం వుంది.

తుల— ఏమిటది?

మంద— మనం బిల్డింగులను యిన్సూరు చేయించుదామా వద్దా?

తుల— మనం తప్పకుండా చేయించాలి.

మంద— ఆ, అయితే యీవిషయం యింకా జాగ్రత్తగా పరిశీలించుదాం.

తుల— నావన్నీ యిన్స్యూరు చేయించాను— ఈ యిల్లూ, యిందులోవున్న సమస్తమూ—చివరికి నా కారుకూడా.

మంద— అవును. అవన్నీ మీ ఆస్తి. నేనూ అలాగే చేయిస్తాననుకోండి. కాని దీని సంగతే వేరు. శరణాలయం ఒక మహత్తర కార్యానికి నిర్దేశించ బడింది.

తుల— అవును. కాని—

మంగ— నామట్టుకు నేను సంబంధించినంతవరకూ మనం మన ఆస్తిని నిరపాయంగా యిన్స్యూరు చెయ్యటం చాలా మంచిదని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

తుల— నేను అనుకొనేదీ అదే.

మంద— కాని యిక్కడవున్న ప్రజల అభిప్రాయ మేమిటీ అని.

తుల— వాళ్ళ అభిప్రాయమా?

మంద— అవును, ఇక్కడేదైనా అభిప్రాయం ప్రచారంలో వుందా అని— ఏదో ఒక అభిప్రాయమని నేననేది.

తుల— ఏదో ఒక అభిప్రాయమంటే?

మంద— ఈ ప్రాంతాల్లో వుండే మోతుబరు మనుష్యులమాట మనం కాదనలేం చూడండి. నేననేది వాళ్ల అభిప్రాయ మేమిటని.

తుల— మనం చేయించాలంటే అడ్డు తగిలేవాళ్లు కొంతమంది లేకపోలేదు—

మంద— అదే నేననేది. పట్నంలో యింకా చాలామంది వుంటారు. సంస్కృత కళాశాల్లో అభిప్రాయ భేదాలు, విభేదాలు మరీ ఎక్కువ. వాళ్ళు మనం చేసేదీ మంచిది గాదని తేలిగ్గా అనేస్తారు.

తుల— కాని మీరు మీ అంతరాత్మ ఒప్పనిదే ఏపనీ చెయ్యరు. మీరు చేస్తున్నప్పుడు మీ అంతరాత్మ ప్రోత్సాహం—

మంద— అవునవును, నాకు తెలుసు. ఆ విషయంలో నా మనస్సు నిర్మల మయినదే. కాని మనం చేసేపని గురించి వచ్చే అపవాదులు, తప్పటభిప్రాయాలు మనం మాన్పలేము. అందులో శరణాలయం వంటి ధర్మ సంస్థల విషయంలో అటువంటివి బాగా అడ్డుతగులుతాయి.

తుల— చివరకి అదే గనక అయినట్లయితే—

మంద— నేనూ ఆ ప్రమాదాన్ని గుర్తించకుండా వుండలేను— నిజానికి నా పరిస్థితి మరీ బాధాకరంగా వుంటుంది. పట్నంలో పెద్ద పెద్ద వాళ్ళంతా యీ శరణాలయం గురించే చర్చిస్తున్నారు. ఈ శరణాలయం పట్టణ వాసస్థుల ఉపయోగానికి కూడా ఉద్దేశింపబడిందేగా. వాళ్ళంతా కలిస్తే మనమాటకి బలంతగ్గుతుంది కాని యింతకీ వాళ్ళకోపానికి ముందు గురిఅయేవాణ్ని నేను— మీ తరఫున పని చేస్తున్నాను గాబట్టి—

తుల— కాని మీరు వాళ్ళకా అవకాశం యివ్వకూడదు.

మంద— పత్రికల్లోను, విమర్శల్లోను నా మీదతీసే దెబ్బలమాట చెప్పనే అక్కరలేదు.

తుల— ఇక ఆ విషయం వదిలెయ్యండి శాస్త్రిగారూ; దానంతట అదే పరిష్కార మవుతుంది.

మంద— అయితే మీరు యిన్స్యూరు చెయ్యవద్దంటారన్న మాట?

తుల— వద్దు, ఆ మాట మరచి పొండి.

మంద— (కుర్చీలో ఆనుకుంటూ) అయితే ఏదన్నా ప్రమాదం వాటిల్లిందనుకోండి—ఏమో చెప్పలేం—మీరు మళ్ళీ దాన్ని బాగుచేయిస్తారా?

తుల— ఏ పరిస్థితులలోను నేను బాగుచేయించడ మనేది జరగదని స్పష్టంగా మీకు చెబుతున్నాను.

మంద— కాని తులశమ్మగారు మనం చాల గొప్ప బాధ్యత వహిస్తున్నాం.

తుల— అయితే మనం బాధ్యతను తోసిపారెయ్యగల మంటూరా?

మంద— అబ్బే, తోసివెయ్యములెండి. మనంమాత్రం తప్పటడుగులు వెయ్యటానికి వీలులేదు. మనం మన గ్రామానికి కళంకం తెచ్చేపని ఏదీ చెయ్యగూడదు.

తుల— అందులోనూ శాస్త్రులుగారయివుండీ మీరు అసలే చెయ్యగూడదు.

మంద— అయితే ఇహనేమిటి? మనం అదృష్టానికి వదలిపెట్టి శరణాలయాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ వుండాలన్నమాట.

తుల— అలాగే చేద్దాములెండి.

మంద— అయితే ఆ విషయం అలావుంచుదాం—మీరు చెప్పినట్టుగానే (నోటు చేస్తాడు) ఇన్సూర్ చెయ్యడంలేదు.

తుల— ఆవిషయాన్ని మీరు యీ వేళ మాట్లాడడం ఆశ్చర్యంగా వుంది—

మంద—నేను యీ విషయం గురించి మాట్లాడదామని చాలాసార్లు అనుకున్నాను—

తుల— ఎందువల్లనంటే అక్కడ నిన్ననే నిప్పు రేగింది.

మంద— నిజంగానే?

తుల— అయితే చివరికి ఏమీ ప్రమాదం జరుగలేదనుకోండి. వడ్రంగి దగ్గరవున్న చిత్రిక నిప్పంటుకుంది.

మంద— ఏది, సర్వారాయుడు పనిచేసే చోటే?

తుల— అవును. అతను అగ్గిపుల్లలు అశ్రద్ధగా పారేస్తాడంటారు వాళ్లంతా.

మంద— అతనికి తాపత్రయం ఎక్కువ. అన్నీ ఆలోచనలే. అతను యికముందునుంచీ ఒకళ్లచేత మాటపడకుండా బతకాలని నిశ్చయించుకున్నాడట. అలా అయితే మంచిదే.

తుల— నిజంగానే? ఎవరు చెప్పారు మీకు?

మంద— అతనే ఆవిధంగా బతకాలని వుందన్నాడు నాదగ్గర. అతను చాలా పనివాడు.

తుల— అవును. తాగకుండా వుంటేను.

మంద— అదే అతనిలోవున్న దోషం. అతని కాలుబాధ అంతపని చేయిస్తుందన్నాడు నాతో. క్రిందటిసారి అతను పట్నం వచ్చినపుడు అతన్ని చూస్తే ఎంతో జాలివేసింది. అతనికిక్కడ నేను పని యిప్పించినందుకు ఎంతో కృతజ్ఞత కనబరిచాడు— తన కూతురు దగ్గర వుండొచ్చని.

తుల— కస్తూరినీ అట్టే ఇదిగా చూడడు.

మంద— మరి నాతో రోజూ చూస్తానని అన్నాడే.

తుల— ఆహా, అదా, అంటే అనివుండొచ్చు.

మంద— తన తప్పుడు అలవాట్లన్నీ మాన్పించడానికి 'నా' అనే వాళ్లెవరైనా తన దగ్గర వుండాలన్నాడు. ఇది సర్వారాయుడి విషయంలో చాలా మెచ్చుకో తగ్గది. మనదగ్గరికి నిరాశతో, కృంగిపోయి వస్తాడు. తనని తను నిందించు కుంటాడు. తన దోషాలన్నీ ఏకరువు పెడతాడు. క్రిందటిసారి నాదగ్గర కొచ్చినపుడు అన్నాడు— అవును గాని తులశమ్మ గారూ కస్తూరి లేకపోతే తను బతకలేనంటే మీరు—

తుల— (అకస్మాత్తుగా నిలబడి) కస్తూరి!

మంద— అతనిమీద ఏమీ కోపగించుకోకండి.

తుల— నేను తప్పకుండా అతన్ని దండిస్తాను. మీకు తెలుసుగా కస్తూరికి శరణాల యంలో పని యిప్పిస్తామని.

మంద— కాని, ఆలోచించండి. ఎంత చెడ్డా అతను ఆమె తండ్రి.

తుల— అతను ఎటువంటి తండ్రో నాకు బాగా తెలుసు. నేను అంగీకరించి ఆమె నెప్పుడూ తండ్రి దగ్గరికి పంపను.

మంద— (లేచి) అమ్మా, అంత త్వరగా నిర్ణయానికి రాకండి, మీరు సర్వారాయుణ్ణి సరిగా అర్థం చేసుకోలేదు. మీరు ఎందుకు భయపడుతున్నారో—

తుల— (శాంతంగా) అది కాదు సంగతి. కస్తూరిని నా సంరక్షణలో వుంచుకున్నాను. నా సంరక్షణలోనే వుంటోంది. (వింటున్నట్టుగా నటించి) ఇస్, శాస్త్రి గారూ, యింక, ఆ విషయం ఎత్తకండి. (ఆమె ముఖం ఆనందంతో వికసిస్తుంది) వినండి! జనార్దనం కిందకి వస్తున్నాడు. మనం యిప్పుడు అతన్ని గురించే ఆలోచిద్దాం.

[జనార్ధనం కోటు తొడుక్కుని, హేటు చేతిలో పుచ్చుకుని, సిగరెట్టు కాల్చుకుంటూ వస్తాడు. ఎడమవైపు ద్వారంనుంచి.]

జనార్ధనం— (గుమ్మంలో నిల్చుని) క్షమించండి. మీరు ఆఫీసు గదిలో వున్నారను కున్నాను. (లోపలికి వచ్చి) నమస్తే శాస్త్రిగారూ.

మంద— (తేరిపార చూస్తూ) అంతా చాలా ఆశ్చర్యంగా వుందే.

తుల— మావాడి గురించి మీ అభిప్రాయమేమిటి శాస్త్రిగారూ ?

మంద— నా— నా అభిప్రాయమా, ఏమీలేదు. ఇలా తయారవడం ?

జనా— శాస్త్రిగారూ, నేను నిజంగా పాడయిపోయిన బాపతే.

తుల— అబ్బే అది కాదోయ్—

జనా— అందుకనే యింటికి తిరిగి వచ్చాను.

తుల— మీరు వాణ్ణి పెయింటరుగాను, ఆర్టిస్టుగాను వుండొద్దని అడ్డు చెప్పిన రోజుల్ని గురించి ఆలోచిస్తున్నాడు మా జనార్దనం.

మంద— మనం పొరపాట్లు చెయ్యవచ్చు. కాని మొదట్లో ఏది చెయ్యబోయినా అది తొందరపడి తప్పటడుగు వేస్తున్నామేమో ననిపిస్తుంది—రాబాబూ, రా! నేను యింకా నిన్ను బాబూ అని పిలవవచ్చునా?

జనా— ఇంకోక లాగ ఎలా పిలుస్తారు?

మంత— అవును, అంతేలే. నేను అనేదేమిటంటే ఆర్టిస్టు జీవితమంటే ఏమిటో నేను తెలుసుకోకుండా అభ్యంతరం పెట్టానని అనుకోను. ఆర్టిస్టుల్లో గూడా చాలా మంది అంతరాత్మను అధఃపతనం నుంచి దూరంగా వుంచిన వారిని నే నెరుగుదును.

జనా— అలాగే అనుకుందాము.

తుల— (సంతోషంతో) అంతరంగికంగా, బహిరంగంగా గూడ అపాయం లేకుండా గడిపిన వాణ్ని నేనెరుగుదును. శాస్త్రిగారూ ఒకసారి వాడివేపు చూడండి.

జనా— (గదిలో పచారుచేస్తూ) అవునమ్మా అవును.

మంద— అది ఎవరూ కాదనరుగాని, నువ్విప్పుడే కొంచెం పేరు సంపాదిస్తున్నావని విన్నాను, నీగురించి పేపర్లలో కూడా చదివాను—నిన్ను గురించి బాగా రాశారులే. కాని యీమధ్య ఎక్కడా మళ్ళీ నీ పేరు తగల్లేదు.

జనా— (వెనుక గదివైపు నడుస్తూ) ఈ మధ్య నేనేమీ బొమ్మలు గీయలేదు.

తుల— అందరి లాగే ఆర్టిస్టు కూడా అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకుంటూ వుండాలి.

మంద— అవునవును, ఆ సమయంలో నూత్నయత్నాలకు సన్నాహమవుతూ బాగా దిట్టపడతాడు.

జనా— అవును. అమ్మా భోజనం తయారయిందా?

తుల— ఒక అరగంటలో అంతా అయిపోతుంది. నీకు జఠరాగ్ని బాగానే వుందన్న మాట.

మంద— సిగరెట్లన్నా ఇష్టమేనన్న మాట.

జనా— నాన్నగారి సిగరెట్టుపెట్టె మేడమీద కనిపించింది—

మంద— ఆ అదే అనుకున్నా!

తుల— ఏమిటి మీ రనుకున్నది?

మంద— జనార్దనం సిగరెట్టు నోట్లో పెట్టుకొని ఆగుమ్మంలో నిల్చుంటే, ఒక్కక్షణం వాళ్ళ నాన్నగారే అనుకున్నా.

జనా— నిజంగానే?

[ యింకావుంది ]